'పది'కి ప్రత్యేక తరగతులు



పరీక్షలపై సూచనలు, సలహాలు ఇస్తున్న ఉపాధ్యాయులు

- మెరుగైన ఫలితాల సాధనకు చర్యలు
- ఉదయం, సాయంత్రం వేళలో నిర్వహణ
- వార్షిక పరీక్షలకు సన్నద్ధం

తాడూరు: ఈ విద్యా సంవత్సరం మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత, 10కి 10 గ్రేడ్ మార్కులు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాను సారం అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీనికోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిన ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాలమేరకు గతేడాది నవంబర్ 1 నుంచి ప్రారంభమైన ప్రత్యేక తరగతులు ఈ నెల 28 వరకు నిర్వహించనున్నారు.

సబ్జెక్టుల వారీగా..

మండలంలో ఆరు జిల్లా పరిషత్ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. ఉదయం, సాయంత్రం హెచ్‌ఎంలతో పాటు ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శ్రద్ధతో పరీక్షలకు సంబంధించిన ముఖ్య అంశాలను బోధిస్తున్నారు. దీంతో పాటు విద్యార్థులు పాఠశాల సమయం కంటే గంట ముందు, సాయంత్రం గంట తరువాత పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధిస్తున్న అంశాలను విద్యార్థులు శ్రద్ధగా నేర్చుకుంటున్నారు. సాయంత్రం విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. దీంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడమే కాకుండా 2,3 రోజులకు ఒకసారి రాత పరీక్షలు నిర్వహిస్తున్నారు.



తాడూరు ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో రివిజన్ చేస్తున్న విద్యార్థులు

మండలంలో ఇలా..

మండలంలో తాడూరుతో పాటు శిర్సవాడ పరీక్ష కేంద్రాలుగా గుర్తించారు. 7 ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలకు సంబంధించి మొత్తం 271 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

సబ్జెక్టులపై పట్టు సాధిస్తున్నాం..



ప్రతి సబ్జెక్టుపై మంచి పట్టు సాధించేందుకు ప్రత్యేక తరగతులు ఎంతో దోహద పడుతున్నాయి. అన్ని సబ్జెక్టులలో ఎలాంటి సందేహాలున్నా, ఉపాధ్యాయులు వెంటనే నివృత్తి చేస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించి బోధిస్తున్నారు.

– బి సునిత, 10వ తరగతి

100 శాతం ఉత్తీర్ణత లక్ష్యం



ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, రోజువారీగా సబ్జెక్టుల పరంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బోధిస్తున్నారు. ఈ సంవత్సరంలో జరిగే 10వ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు 10కి 10 గ్రేడ్ సాధించేందుకు అందరం కృషి చేస్తున్నాం.

– అనిల్‌రెడ్డి, హెచ్‌ఎం, తాడూరు

క్లుప్తంగా

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

వెల్దండ: మండలంలోని గుండాల గ్రామంలో శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయ ఉత్సవాల కోసం నూతనంగా 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను చైర్మన్ సందీప్‌రెడ్డి, ఈఓ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాలయ వైస్ చైర్మన్ అరుణ్‌కుమార్, కిసాన్‌సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, అంజయ్య, లింగం, తిర్పతయ్య, మల్లయ్య, ఆలయ అర్చకులు శివ, నరహరి, సూరి, సంతోష్, లైన్‌మెన్ నాగేష్ ఉన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



కల్వకుర్తి రూరల్: రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి చేస్తోందని జిల్లా మాజీ సర్పంచ్ గుమ్మకొండ రాములు అన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రాయితీపై జిల్లెల్ల గ్రామానికి చెందిన ఆరు మంది రైతులకు మంజూరైన స్ప్రింక్లర్ సెట్లను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ రవి గౌడ్, మహేందర్, బీరయ్య, బాల్ జంగయ్య, కంపెనీ ప్రతినిధి శ్రీధర్ రెడ్డి, భాస్కర్, సుజాతమ్మ, గోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా భోజనశాల



తాడూరు: మండలంలోని మేడిపూర్ ఉన్నత పాఠశాలలో మనబడి, మన ఊరు పథకంలో భాగంగా నిర్మించిన భోజనశాల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 4 ఏళ్ల క్రితం గత ప్రభుత్వం హడావిడిగా పనులు ప్రారంభించింది. బిల్లులు సకాలంలో రాకపోవడంతో పనులు నిలిపేసినట్లు అధికారులు పేర్కొన్నారు. నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిపేయడంతో విద్యార్థులు చెట్లకింద మధ్యాహ్న భోజనం చేయాల్సి వస్తోంది. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్మాణ పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై డీఎంకు ఫిర్యాదు

తాడూరు: మండల కేంద్రంలో కల్వకుర్తి వైపు వెళ్తున్న కల్వకుర్తి బస్ డ్రైవర్ ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఆదివారం డీఎంకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు. గగ్గలపల్లి మీదుగా వస్తున్న బస్సు బస్‌స్టాప్ దగ్గర ఆపి కొంతమందిని మాత్రమే ఎక్కించుకొని, మరికొందరు ఎక్కేవరకు ఆపకుండా వెళ్లాడు. దీంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. బస్సు డ్రైవర్ తీరుపై కల్వకుర్తి డీఎంకు ఫిర్యాదు చేసినట్లు ప్రయాణికుడు బంగారయ్య తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం..



ఉప్పునుంతల: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పట్లో విద్యాబోధన చేసిన గురువులు దామోదర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జీవన్‌కుమార్, మైనోద్దీన్‌లను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీను, వెంకటరమణ, జంగయ్య, బాలకృష్ణ, శేఖర్, ప్రవీణ్‌రెడ్డి, నాగేష్, ఎల్లయ్య, రాజేష్, స్వాతి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో దోమల భయం

తెలకపల్లి: మండలంలోని గట్టురాయపాకుల గ్రా మంలో దోమలు విపరీతంగా ఉన్నాయని, వాటిని నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రా మంలో దోమల ఉధృతి గణనీయంగా పెరిగాయని, గ్రామంలో రోడ్ల వెంట పెంటకుప్పలు దర్శనమి స్తున్నాయి. వీధుల్లో పారిశుద్ధ్యం లోపించి మురుగు ఉండడంతో దోమలకు ఆవాసంగా మారింది. గ్రా మంలో పంచాయతీ కార్యదర్శి లేకపోవడం వల్ల పారిశుద్ధ్యంపై పట్టించుకునే నాథుడేలేడు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించి, గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

'రాజకీయంగా ఎదుర్కోలేకనే ఆస్తులకు నష్టం'

లింగాల: అధికార పార్టీకి అనతి కాలంలోనే ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పి పుచ్చుకోవడానికి బీఆర్‌ఎస్ నాయకుల సొంత ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు కేటీ.తిర్పతయ్య, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆ పార్టీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని అంబట్‌పల్లిలో సింగిల్ విండో చైర్మన్ నిర్మించిన ప్రహరీని కక్ష పూరితంగా రాత్రికి రాత్రే కూల్చి వేయించారని ఆరోపించారు. సర్వే చేసిన అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసు బందోబస్తుతో కూల్చివేయడం దారుణమన్నారు. ఎలాంటి తప్పులు చేయక పోయినా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి భయాందోళనలకు గురి చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో అశోక్‌రెడ్డి, శ్రీనివాసులు, నర్సింహ, జయంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, హన్మంత్‌నాయక్, పర్వతాలు, బీజేపీ నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, కోనేటి తిర్పతయ్య, వెంకటగిరి, వివిధ గ్రామాల కార్యకర్తలు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా నాయకులు తిర్పతయ్య

భద్రతా నిబంధనలు పాటించాలి

చారకొండ: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శంషోద్దీన్ తెలిపారు. లైసెన్స్, వాహనపత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. మండల కేంద్రంలో ప్రధాన జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీలో వాహనాల సంబంధిత పత్రాలు, ఆర్సీ, ఇన్స్యూరెన్స్, పొల్యూషన్, ఫిట్‌నెస్ తదితర సంబంధిత పత్రాలు తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహనం నెంబర్ బోర్డు సరిగా లేకపోవడంతో పలువురు వాహనదారులకు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ నాగయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



వాహనాల పత్రాలు పరిశీలిస్తున్న ఎస్‌ఐ శంషోద్దీన్

శివమాలధారులకు పండ్ల పంపిణీ



శివమాలధారులకు పండ్లు పంపిణీ చేస్తున్న దాతలు



తాడూరు పూజలో పాల్గొన్న శివమాలధారులు

బిజినేపల్లి: పాదయాత్రగా శ్రీశైల క్షేత్రానికి వెళ్తున్న శివమాలధారులకు మండలంలోని పాలెం సుబ్బయ్య విగ్రహం ముందు దాతలు పండ్లు పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన దాతలు కురుమూర్తి, కొండల్ ప్రభావతిల సహకారంతో రాత్రి వరకు మాలధారులకు పండ్లు, నీళ్లు అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్, శివ, కృష్ణ, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

శివమాలధారుల ఊరేగింపు

తాడూరు: మండల కేంద్రంలో శివమాలధారులు భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల్లో శివుడిని స్మరిస్తూ ఊ రేగింపు నిర్వహించారు. ఉమాభోగలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సామూహికంగా వీరభద్రుని సేవ నిర్వహించారు.

శ్రీశైలానికి శివమాలధారులు

కోడేరు: మండల కేంద్రంలో శివమాలధారులు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఆటపాటలతో శ్రీశైలానికి బయలుదేరారు.

భక్తిశ్రద్ధలతో ఈదమ్మ జాతర



అలంకరణంలో ఈదమ్మ మాందాతలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఆదివారం ఈదమ్మ దేవత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తు కొందరు కోడిపుంజులు, పొటేళ్లు అమ్మవారికి బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సంతబజారు వరకు తినుబండారాలు, గాజులు, స్వీట్లు, ఆట వస్తువులు తదితర వాటి స్టాళ్లు ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటుగా జాతర కొనసాగనుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్సవాలకు ముస్తాబైన ముఖద్వారం



అలంపూర్: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలు మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. 26న మహాశివరాత్రి సందర్భంగా దక్షిణ కాశీ క్షేత్రంగా పేరగాంచిన అలంపూర్ జోగుళాంబ ఆలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అలంపూర్ చౌరస్తాలోని 44వ జాతీయ రహదారి పై ఓవర్ కూడలిలో ముఖద్వారం, కర్నూల్–హైదరాబాద్ మా ర్గంలోని స్వాగత తోరణానికి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

26న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



వీరబ్రహ్మేంద్రస్వామి మూలవిరాట్

వెల్దండ: మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దే వాలయంలో ఈనెల 26న వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 33వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం సు ప్రభాత సేవ కార్యక్రమం, 6గంటలకు పతాకావిష్కరణ, అఖండ దీపారాధన, తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పా ల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నికల కోసమే ఇందిరమ్మ ఇళ్లు

బిజినేపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమ లు చేయకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి తెరలేపారని బిజినేపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై రుసుం రద్దు చే యాలని గతంలో గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ ప్రభు త్వం నేడు అధికారంలోకి వచ్చాక రుసుంను ఎలా పెంచుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు.

భగవద్గీతతో ఆధ్యాత్మిక చింతన



కొత్తకోట రూరల్: భగవద్గీత చదివితే జ్ఞానం పెరుగుతుందని త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని ఆదివారం పెద్దమందడి మండలంలోని చిలకటోనిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత అను బంధ గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శివరాత్రి విశిష్టతను తెలిపారు.

తెల్లరాళ్లపల్లితండా వాసికి జాతీయ స్థాయి ఫెలోషిప్



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండా కు చెందిన ఇస్లావత్ వెంకటేష్ జాతీయ స్థాయి ఫెలోషిప్‌కు ఎంపికైనట్లు ఆయన ఆది వారం తెలిపారు. జాతీయ స్థాయి పరీక్ష అ యిన యూజీసీ నెట్ డిసెంబర్ 2024 ఫలితాలు శనివారం విడుదల కాగా ఆ ఫలితాల్లో లా సబ్జెక్టులో ఉత్తమ మార్కులు సాధించి జేఆర్‌ఎఫ్‌కు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సుభాష్ నగర్ లో వెలసిన శ్రీ లక్ష్మీపద్మావతి సహిత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. వేకువజామున సుప్రభాత సేవతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి పంచామృత అభిషేకం, ప్రభాతసేవ, బాల భోగం నిర్వహించారు. గణపతి పూజ, రక్షా బంధనం, భగవద్గీత, విష్ణు సహస్ర పారాయణం నిర్వహించారు. ఆలయ చైర్మన్ కల్వ మనోహర్ దంపతులు పూజలో పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు.



బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు



కొల్లాపూర్‌లో ధ్వజస్తంభ ప్రతిష్ఠలో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి



బిజినేపల్లిలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న ఆర్యవైశ్యులు

కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ పట్టణంలోని గంగాభవానీ ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభ పునర్నిర్మాణకర్త రెడ్డిగారి బాలచంద్రి పూజలు చేశారు. తెలుగు, గంగపుత్ర కులస్తులు పెద్దసంఖ్యలో ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్‌లు ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొని, గంగాభవానీ దేవతకు పూజలు చేశారు. కార్యక్రమాలను గంగపుత్ర సంఘం నాయకులు నక్క బిచ్చన్న, సుధాకర్, పెద్దూరి లక్ష్మయ్య, సంగెం, రాముడు, మద్దిలేటి, పిట్టల సుధాకర్, నర్సింహ, తదితరులు ఉన్నారు.

- పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షులు ఎల్లేని సుధాకర్ రావు, కాంగ్రెస్ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు, జూపల్లి అరుణ్ కుమార్‌రావు, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, దండు నరసింహ, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, నాగరాజు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చంద్రమౌళి, కిషోర్, రాజశేఖర్, ప్రవీణ్ కుమార్‌లు పాల్గొన్నారు.

ఇష్టారీతిన మాంసం విక్రయిస్తే చర్యలు

కల్వకుర్తి టౌన్: దుకాణదారులు మాంసాన్ని వారికి ఇష్టమొచ్చిన రీతిలో విక్రయిస్తే చర్యలు తప్పవని కల్వకుర్తి పశువైద్యాధికారి నాగరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు మాంసం దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని పలువురు దుకాణాదారులు గొర్రె మాంసాన్ని పొట్టేలు మాంసంగా వృషణాలను పెట్టి అమ్మకాలు చేయడాన్ని ఆయన గమనించి వారిని హెచ్చరించారు. దీంతో ఇలానే వ్యాపారం చేస్తామని వాగ్వివాదానికి దిగారు. మాంసాన్ని విక్రయించే క్రమంలో వైద్యాధికారి ముద్రతో పాటుగా, స్లాటర్ హౌజ్‌లోనే వాటిని శుభ్రం చేసి దుకాణాలకు తీసుకొచ్చి విక్రయించాలని హెచ్చరించారు. దుకాణాల వద్ద పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, ప్రజలకు నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట వెటర్నరీ అసిస్టెంట్లు ఉన్నారు.



మాంసం దుకాణాలు తనిఖీ చేస్తున్న పశువైద్యాధికారి నాగరాజు, వారి సిబ్బంది

ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం

తాడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారుల ఎంపిక వివిధ అంశాలను దృష్టిలో ఉంచుకోని మోడల్ హౌస్ నిర్మాణ పనులు చేపట్టిందని ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. అందులో భాగంగా మోడల్‌గా నిర్మించే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. అనంతరం కార్యాలయాలకు వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటుందన్నారు.



కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న మోడల్ హౌస్

సేవాలాల్ గొప్పతనం మరువలేనిది



మాట్లాడుతున్న డాక్టర్ అనురాధ

అచ్చంపేట రూరల్: గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ గొప్పతనం మరువలేనిదని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సతీమణి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ అన్నారు. ఆదివారం అచ్చంపేటలో సంతు సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించారు. గిరిజన భవన్ నుంచి పట్టణంలోని ప్రధాన రహదారి గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అచ్చంపేట పట్టణంలో సంతు సేవాలాల్ గుడి నిర్మాణం కోసం తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

వీరాంజనేయ విగ్రహ పునఃప్రతిష్ఠ

వనపర్తి టౌన్: 400 ఏళ్ల నాటి వనపర్తి పట్టణంలోని పాతబజార్‌లోని సీతారామ సైత వీరాంజనేయ ఆలయం పునః ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాస్థాపన, బొడ్రాయి ప్రతిష్ఠ, శయాధివాసంలో ఉన్న దే వతామూర్తులను ప్రతిష్ఠ చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహాలకు జీవకళ ఉట్టిపడేందుకు జీవన్యాసము, నేత్రోన్మీలనం చేపట్టారు. అనంతరం కామధేనుతో దేవతామూర్తులను ద ర్శించుకోవడంతో మూడు రోజులుగా నడుస్తున్న పూర్ణాహుతి క్రతువును పూర్తి చేశారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం శంకు, చక్రాలు, త్రిశూలం, నాగదేవతామూర్తుల కలిగిన 42 అడుగుల ఎత్తైన ఏకశిల ధ్వజస్తంభం ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా చేపట్టారు. అంతకుముందు భక్తులు ఏకశిల ధ్వజస్తంభానికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వేద పండితులు జోషి ప్రశాంత్‌శర్మ, ధీరజ్‌శర్మ, నరేందర్‌శర్మ, శాంతికృష్ణశర్మ, రాజకీయ నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

